క్లుప్తంగా

441 మందికి వైఎస్సార్ ఈబీసీ లబ్ధి

ఉంగుటూరు: మండలంలోని 27 గ్రామ పంచాయతీలు 16 గ్రామ సచివాలయాల్లో వైఎస్సార ఈబీసీ నేస్తం పథకం ద్వారా 441 మందికి రూ.66 లక్షలు లబ్ధి చేకూరుతుందని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. ఈబీసీ నేస్తం నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. తేలప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం ఈబీసీ నేస్తం సంబరాలు నిర్వహించేందుకు సభ జరుగుతుందని తెలిపారు.

ముస్తాబాదలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

గన్నవరంరూరల్: వైద్యాన్ని ప్రభుత్వం పేదల చెంతకు చేర్చిందని ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్ డాక్టర్లు అభిషేక్, అఖిల్ పేర్కొన్నారు. మండలంలోని ముస్తాబాద సచివాలయం-2 వద్ద బుధవారం రోగులకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని చెప్పారు. దీర్ఘకాల రోగులకు, కదల్లేని స్థితిలో ఉన్నవారికి సైతం సేవలను అందిస్తామన్నారు. 104 వాహన వైద్య సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

మానవత భవన నిర్మాణానికి దాతల వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ కార్యాలయం నిర్మాణానికి దాత రూ.35 వేలు విలువ చేసే సిమెంట్‌ను అందజేశారు. స్థానిక గుడివాడరోడ్డుకు చెందిన తవ్వా కుటుంబరావు, సుజాత దంపతులు మానవత భవన నిర్మాణానికి తమ వంతుగా వితరణ అందించారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావుకు 100 సిమెంట్ కట్టలను తవ్వా కుటుంబరావు దంపతులు బుధవారం ఇచ్చారు. దాతలను మానవత సభ్యులు అభినందించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు చక్కా సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై నేడు విచారణ

పెనమలూరు: పెనమలూరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గుడివాడ డీఎల్‌పీఓ కార్యాలయంలో గురువారం విచారణ జరగనుంది. ఈ మేరకు పెనమలూరు గ్రామ పంచాయతీలో గతంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులు విచారణకు హాజరుకావాలని డీఎల్‌పీఓ జి.సంపత్‌కుమారి ఆదేశించారు. పెనమలూరు గ్రామ పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పని చేసి ప్రస్తుతం చోడవరం గ్రామ పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పని చేస్తూ సస్పెన్షన్‌కు గురైన షేక్ షంషుద్దీన్ పెనమలూరు పంచాయతీలో పని చేసిన కాలంలో రూ.47,03,953 సొమ్ము స్వాహా చేశాడు. దీనిపై డీఎల్‌పీఓ విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా నేడు పెనమలూరు గ్రామ పంచాయతీలో పని చేసిన పూర్వ పంచాయతీ కార్యదర్శులు అల్లాపురంలో పని చేస్తున్న ఏఎస్‌ఆర్ కోటేశ్వరరావు, పెదఅవుటపల్లిలో పని చేస్తున్న ఎం.సరోజిని, గొడవర్రులు పని చేస్తున్న ఎంపీయూ ప్రసాద్, పెనమలూరులో పని చేస్తున్న కె.రాధాకృష్ణలను ఉదయం 11 గంటలకు తన కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని డీఎల్‌పీఓ సంపత్‌కుమారి ఆదేశించారు.

సస్యరక్షణ చర్యలతో మసిమంగు తెగులు నివారణ

గన్నవరంరూరల్: మామిడి తోటల్లో మసిమంగు తెగులు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్, హార్టీకల్చర్ అసిస్టెంట్ వి.దీక్షా పేర్కొన్నారు. సూరంపల్లి గ్రామ మామిడి రైతులకు మసిమంగు తెగులు నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆకులపైన మసి పూసినట్లుగా నల్లటి పొరలా ఏర్పడే మసి వలన కిరణజన్య సంయోగ క్రియ జరగదని, ఈ కారణంగా కాయ ఎదుగుదల, దిగుబడి క్షీణిస్తాయని చెప్పారు. నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలన్నారు. ఆకులపై మసి తొలగించేందుకు రెండు కిలోలు గంజి పొడిని గోరువెచ్చటి నీటిలో నాలుగు లీటర్లు కలిపి ఉడికించి తరువాత నీరు పోసి వంద లీటర్లు గంజి ద్రావణం తయారు చేసి తెగులు కనిపించిన భాగాలపై ఎండ బాగా సమయంలో పిచికారీ చేయాలన్నారు. మసిమంగు తెగులు నివారణతో రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు.

జగనన్న సంక్షేమ పాలనే కావాలి

పోరంకిలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం


పోరంకి ప్రభునగర్‌లో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: జగనన్న సంక్షేమ పాలనే తమకు కావాలని, జగనన్న పాలనలో భరోసాగా జీవించగలుగుతున్నామని లబ్ధిదారులు కె.విశ్వరూపం, ఎ.విజయలక్ష్మి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం పోరంకి ప్రభునగర్‌లో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వం అందిచిన సంక్షేమ పథకాల బ్రోచర్‌లు పంపిణీ చేసి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న సంక్షేమ పాలన వలనే తాము ఆర్థికంగా నిలదొక్కుకున్నామని లబ్ధిదారులు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలు జగనన అన్ని వర్గాల వారికి అమలు చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కాలనీలో డ్రెయినేజీల సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. యానాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.

అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం..

జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశారన్నారు. జగనన్న పాలనలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు జగనన్నపాలనలో భరోసా కలిగిందన్నారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, వైఎస్సార్ సీపీ నేతలు మున్నంగి అర్జున్‌రెడ్డి, నల్లమోతు జీవన్, అద్దేపల్లి చందు, అంకెం రాజేష్, పాతూరి రవి, చలమల జోజి, ఉప్పాల వీరబాబు, వీర్ల బుజ్జి, ఎన్.రామచంద్రరావు, చుండూరు శేఖర్, బందెల రాజు, ముచ్చు నాగేంద్ర, రచ్చా వెంకటేశ్వరరావు, బొర్రా వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న భూసర్వే


డ్రోన్ సర్వేను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ జాహ్నవి

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు, రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో బుధవారం జగనన్న భూ సర్వేలో భాగంగా తహసీల్దార్ జాహ్నవి ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే నిర్వహించారు. తొలుత ప్రసాదంపాడులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రోన్‌తో సర్వే నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం రామవరప్పాడు, ఎనికేపాడులో ఈ సర్వేను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రసాదంపాడు వీఆర్వో చక్రధరరావు మాట్లాడుతూ.. ఇటీవల రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి భూముల సర్వే చేశామని తెలిపారు. డ్రోన్ సహాయంతో సర్వే నంబర్లు, గట్లు ప్రకారం ఫొటోలు తీసి కచ్చితమైన సర్వే నిర్వహించామన్నారు. ఈ సర్వే ప్రకారం భూములు, పొలాల దస్తావేజులు పరిశీలించి రైతుల సమక్షంలో సరిహద్దు రాళ్లు వేస్తామన్నారు. దీని ప్రకారం రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను ఉన్నతాధికారులు జారీ చేస్తామని చెప్పారు. ప్రసాదంపాడు, రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో 3 వేల ఎకరాల్లో సర్వే నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు రాధాకృష్ణ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జంక్షన్ ఎస్‌ఐ జనార్దన్ బాధ్యతల స్వీకరణ



హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఏడీఎల్ జనార్దన్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న వాసా వెంకటేశ్వరరావును మచిలీపట్నం పీఎస్‌కు బదిలీ చేయటంతో, ఆయన స్థానంలో చిలకలపూడి ఎస్‌ఐగా పని చేస్తున్న ఏడీఎల్ జనార్దన్ నియమితులయ్యారు. దీంతో ఆయన బుధవారం హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. కాగా హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ-2గా విధులు నిర్వహిస్తున్న యూఎల్ సుబ్రహ్మణ్యంను చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కావటంతో, ఆయన స్థానంలో ఉయ్యూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ-2గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న టి.తిరుమలరావును ఇక్కడకు బదిలీ చేశారు. నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఏడీఎల్ జనార్దన్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ రవాణాలను అడ్డుకునేందుకు కృషి చేస్తానని చెప్పారు.

వృద్ధాశ్రమానికి బియ్యం అందజేత



పెనమలూరు: పంజాబ్ నేషనల్ బ్యాంక్ 129 వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కానూరు వృద్ధాశ్రమానికి బుధవారం బియ్యం పంపిణీ చేశారు. డెప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వ్యవస్థాపన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపి పీఎన్‌బీ శాఖల్లో ఖాతాదారులకు సమావేశం జరిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు.

సురక్షిత మాతృత్వంపై అవగాహన అవసరం



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సురక్షిత మాతృత్వ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో వైద్యులు విజయకుమార్ మాట్లాడుతూ.. సురక్షిత మాతృత్వంపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ఆహార, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తల్లులు, చిన్నారుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విజయ్‌కుమార్‌ను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మడుపల్లి బాలకృష్ణమూర్తి, వీసం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో తొలిరోజున అష్టోత్తర కళాశాభిషేకం, పుణ్యనది తీర్థాభిషేకాలను అర్చకులు చక్రావధానుల సీతారామానుజాచార్యులు, శ్రీకాంత్ కృష్ణామాచార్యులు నిర్వహించారు. అనంతరం భక్తుల ఇంటి నుంచి బిందెలతో తీసుకువచ్చిన నీటితో స్వామి వారికి చందన జలాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు కాకాని వెంకటేశ్వరరావు(బాబు), తవ్వా పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ


యనమలకుదురులో చీరలు అందజేస్తున్న ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యులు


తాడిగడపలో చీరలు పంపిణీ చేసిన దాతలు

పెనమలూరు: యనమలకుదురు జన్మభూమి వంతెన వద్ద బుధవారం పేద ముస్లిం మహిళలకు ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్.నాగుల్‌మీరా మాట్లాడుతూ తమ సంస్థ పేద ముస్లిం మహిళలు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేసి సాయం అందిస్తుందన్నారు. రంజాన్ పండుగ నేపథ్యంలో దాతలు స్పందించి పేదలకు నిత్యావసర సరుకులు అందచేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ అజ్మతుల్లా, పెనమలూరు మండల కమిటీ అధ్యక్షుడు జహీరుద్దీన్, గన్నవరం నియోజకవర్గ ప్రతినిధులు షేక్ కాశిం, అబ్దుల్ రహీం, ఎండీ గౌస్, షేక్ సుభాని పాల్గొన్నారు.

తాడిగడపలో అందజేత

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ వసంత నగర్ కాలువ కట్టపై బుధవారం లాస్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. లాస్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కటికల ప్రకాశరావు ఆధ్వర్యంలో వృద్ధులు, పేదలు, వితంతువులకు చీరలు అందజేశారు. పేదలకు తమ సంస్థ దుస్తులు పంపిణీ చేసి తమ వంతు సాయం అందిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కంచర్ల రాజేష్, పోగుల నాగరాజు, గుదే సునీత పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

పెనమలూరు: బీసీల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బీసీ కులగణన చేయాలని ప్రభుత్వం తీసుకున నిర్ణయం ప్రభుత్వానికి బీసీలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జనగణనలో బీసీ కులాల జనగణన చేయాలని ప్రకటన చేయటంపై బుధవారం పోరంకి ప్రభునగర్‌లో ఏపీ బీసీ సంఘం ఆధ్వర్యంలో జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీల కులగణన చేయాలని నిర్ణయించటం బీసీలకు పెద్ద పండుగన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా నేటికి కులాల గణన చేయలేదన్నారు. దీని కారణంగా అనేక కులాలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నాయని తెలిపారు. కులగణన చేయటం వలన ప్రతి కులానికి తగిన న్యాయం జరుగుతుందన్నారు. బీసీ కులగణన చేస్తే సముచిత న్యాయం జరుగుతుందని వివరించారు.

నిర్ణయం హర్షణీయం

ఏపీ బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయాన్ని నినాదంగా కాకుండా ఒక విధానంలో చేసుకుని బీసీలకు న్యాయం చేయాలని జగనన్న తీసుకున్న నిర్ణయం చరిత్రలో హర్షించతగిన విషయమన్నారు. జగనన్న బీసీల పక్షపాతని రుజువు చేశారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహిధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు, గుడివాడ నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహారావు, సభ్యులు ముచ్చు నాగేంద్ర, నయనవరపు శేషుబాబు, పుట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠానికి రూ.8.83 లక్షల ఆదాయం

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 2022 నవంబర్ 19 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు 142 రోజులకు రూ.8,83,181 ఆదాయం లభించింది. శనైశ్వర స్వామి దేవస్థానం ఈఓ జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు 12 హుండీల్లోని కానుకలను లెక్కించారు. ఆలయ పాలకవర్గ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

పండుగలు ఐక్యతకు చిహ్నాలు

పటమట(విజయవాడతూర్పు): పండుగలు ఐక్యతకు చిహ్నాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ అన్నారు. స్థానిక తొమ్మిదో డివిజన్ పటమటలంక చిన్న రామాలయం వద్ద శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని బుధవారం అన్నదాన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి హాజరైన భవకుమార్ పలువురికి అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి వల్లూరు ఈశ్వర్ ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు గద్దె కల్యాణ్, రామాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలన స్వర్ణయుగం


పెరికీడులోప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఏపీ ఆర్డీసీ చైర్మన్ సుబ్బరాజు


కుందేరులో కరపత్రాలు అందజేస్తున్న బిందుమాధవి

ఇంటింటికీ 'జగనన్నే మా భవిష్యత్'

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రజలకు స్వర్ణయుగమని ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు అన్నారు. బాపులపాడు మండలంలోని పెరికీడులో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో పాటుగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి నేరుగా ప్రజలను కలిశారు. గత టీడీపీ ప్రభుత్వ హాయంలో నారా చంద్రబాబు నాయుడి పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సివచ్చేదని, కానీ నేడు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులందరికి సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. వైస్ ఎంపీపీ పండు రాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. ప్రజల అనుమతితో ఇంటింటికీ జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అంటించారు. సర్పంచ్ పల్లపోతు జాన్ ప్రకాష్, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి, ఉప సర్పంచ్ మజ్జి దీవెనకుమార్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్, నాయకులు పండు నాగార్జున పాల్గొన్నారు.

జగనన్నతోనే ఉజ్వల భవిత

కంకిపాడు: జగనన్నతోనే రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిత సాధ్యమని ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి అన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు తాతినేని కిషోర్, టి. ఆదినారాయణ, ఆకుల రంగారావు పాల్గొన్నారు. ఈడుపుగల్లు బీసీ కాలనీలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, మాజీ సర్పంచ్ మాదు అరుణ్‌కుమార్, సీనియర్ నాయకులు వీరమాచనేని శ్రీనివాసరావు, నకరికంటి శేఖర్, బిళ్లా వెంకటేశ్వరరావు, షేక్ జమాల్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

రామవరప్పాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. విజయవాడరూరల్ మండలం నున్న సచివాలయం-2 పరిధిలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్, సొసైటీ అధ్యక్షుడు పోలారెడ్డి చంద్రారెడ్డి, ఎంపీటీసీ గొంతు సరోజిని, ఉప సర్పంచ్ కె.బ్రహ్మారెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబు పర్యటన రోడ్ షోకే పరిమితం

కంకిపాడు/పెనమలూరు/ఉయ్యూరు: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటన రోడ్ షోకే పరిమితమైంది. జిల్లా పర్యటనలో భాగంగా పాత చెక్‌పోస్టు సెంటర్ నుంచి మచిలీపట్నం వరకూ బుధవారం చేపట్టిన ర్యాలీ కామయ్యతోపు, తాడిగడప, పోరంకి, గోసాల సెంటరు, చిన ఓగిరాల, గండిగుంట సెంటర్లు మీదుగా సాగింది. ప్రధానంగా చెక్‌పోస్టు నుంచి ఉయ్యూరు వరకూ మోటరు బైక్ ర్యాలీ అంటూ టీడీపీ శ్రేణులు రెండు రోజులుగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశాయి. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న నేత చంద్రబాబు పర్యటనకు వచ్చినా ఆశించిన విధంగా శ్రేణులు కదల్లేదు. దీంతో బైక్ ర్యాలీ కాస్తా రోడ్ షోగా మారింది. చంద్రబాబును కలిసేందుకు పోరంకి, ఈడుపుగల్లు, చిన ఓగిరాల సెంటర్లలో పార్టీ శ్రేణులు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఎండలోనే పడిగాపులు కాశారు. అయితే ఈడుపుగల్లు సెంటరు దాటే సరికి సమయం సాయంత్రం 6.30 దాటింది. దారి పొడవునా పార్టీ శ్రేణులు బైక్‌లు, కార్లపై నడిరోడ్డుపై విన్యాసాలు చేస్తూ హడావిడి చేశారు. రోడ్‌షోకు వచ్చిన ఎన్టీఆర్, బాలయ్య అభిమానులు వారి ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను చంద్రబాబుకు చూపిస్తూ నినాదాలు చేసినా వారిని పట్టించుకోకుండా చంద్రబాబు ముందుకు సాగటం గమనార్హం. నియోజకవర్గంలో నేతల మధ్య ఆధిపత్య పోరు కనిపించింది. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, నాయకులు వైవీబీ రాజేంద్రప్రసాద్, వెలగపూడి శంకర్‌బాబు, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, దేవినేని గౌతమ్ ఎవరికి వారు చంద్రబాబు వద్ద తమ ప్రాబల్యాన్ని చూపటం కోసం పోటీ పడి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అంతే తప్ప జనసమీకరణ చేయకపోవటంతో నేతల మొఖాల్లో ఉత్సాహం కనిపించలేదు. ఇదిలా ఉంటే ఎమ్మెల్సీగా ఎన్నికైన పంచుమర్తి అనూరాధ ఫొటోలు కొన్ని బ్యానర్లపై లేకపోవటంతో హడావిడిగా ఆమె ఫొటోలను ముద్రించిన స్టిక్కర్లను బ్యానర్లపై అంటించి ప్రోటోకాల్ పాటించామని సరిపెట్టుకున్నారు.

వీఎన్ పురంలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి శ్రీకారం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ రవి, నాయకులు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి బుధవారం శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక నేతృత్వంలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, ఏఎంసీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. వీఎన్ పురం కాలనీ ఏర్పడి రెండున్నర దశబ్దాలు గడిచిన ప్రధాన రహదారులు మినహా అంతర్గత రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదేశాలతో గ్రామపంచాయతీ నిధులతో గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. మొత్తం 1.08 కిలోమీటర్ల పొడవునా 56 అంతర్గత రహదారులను అభివృద్ధి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. కాలనీలోని రోడ్ల అభివృద్ధికి మండల పరిషత్ ద్వారా కూడా నిధులు మంజూరు చేస్తానని ఎంపీపీ అనగాని రవి తెలిపారు. కాలనీలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చేందుకు అదనంగా పంచాయతీ సిబ్బందిని కేటాయించాలని ఈఓ మౌనికకు సూచించారు. వైస్ ఎంపీపీ కాలగడ్డ శివ నాగరాజకుమారి, ఎంపీటీసీ సభ్యులు కొంటి కిషోర్, పీఏసీఎస్ అధ్యక్షుడు పలగాని శివాజీ, నాయకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, పసుపులేటి ఏడుకొండలు, వడ్లమూడి రాజు, పడమట రవి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖాధికారుల తనిఖీలు

పెనమలూరు: పెనమలూరు సెక్షన్‌లో విద్యుత్ శాఖాధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డెప్యూటీ కార్యనిర్వహణాధికారి బి.నవీన్‌కుమార్ వివరాలు తెలుపుతూ పెనమలూరు సెక్షన్‌లోని గంగూరు, గోసాల, వణుకూరు, పెనమలూరు, చోడవరం, పోరంకి ప్రాంతాల్లో 37 బృందాలు 72 మంది గృహ వినియోగదారులు, 7 వాణిజ్య వినియోగదారులను తనిఖీ చేశామన్నారు. లోడు క్రమబద్ధీకరణకు రూ.2,82,000 అపరాధ రుసుం విధించామని తెలిపారు. తనిఖీల్లో డీఈ పి.హరిబాబు, డెప్యూటీ ఈఈ ఎం.పూర్ణచంద్రరావు, పెనమలూరు ఏఈ ఆర్.సూర్యనారాయణ, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

దాహార్తులకు మజ్జిగ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మండే ఎండల్లో దాహార్తులకు చల్లటి మజ్జిగను సామాజిక బాధ్యతగా పంపిణీ చేస్తున్నామని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు బి.వసంత కుమార్ పేర్కొన్నారు. దుర్గాపురం అల్లూరిసీతారామరాజు వంతెన సమీపంలో బుధవారం 300 మంది పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సొసైటీ సభ్యులు గుర్రం ఏడుకొండలు, మండా రాము, వీరంకి గోకర్ణేశ్వరారావు, కొండా ఏసు బాబు, కోలా నాగరాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.